ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022 8 పేజీలు
గుంటూరు పల్నాడు




సిసిఐ ప్రేక్షకపాత్ర

- రైతుల వద్ద పత్తి కొంటున్న వ్యాపారులు
- క్వింటాళ్‌కు గరిష్టంగా రూ.8 వేల చెల్లింపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి





వివిధ మార్కెట్‌ యార్డులు, జిన్నింగ్‌ మిల్లుల పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (సిసిఐ) ఇటీవల ప్రకటించింది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో గత కొంత కాలంగా 11 యార్డుల పరిధిలో కొనుగోలు జరిగేది. తరువాత క్రమంగా జిన్నింగ్‌ మిల్లుల్లో కూడా కొనుగోలు చేపట్టారు. గత రెండేళ్లుగా కనీస మద్దతు ధర కన్నా మార్కెట్‌లో అధిక ధర ఉండటం వల్ల సిసిఐ కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం లేదు. గతేడాది మొత్తం మార్కెట్‌ ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోనే జరిగింది. ఈ ఏడాది కూడా గుంటూరుతో సహా 11 మార్కెట్‌ యార్డుల పరిధిలో కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మరో 10 జిన్నింగ్‌ మిల్లుల్లో కూడా కొనుగోలుకు అనుమతి ఇచ్చారు. ఈనెల ఒకటో తేదీ నుంచి పత్తి కొనుగోలుకు కేంద్రాలు తెరిచినట్టు అధికారులు ప్రకటించారు. కానీ ఎక్కడా ఇంత వరకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. వ్యాపారులే రైతుల వద్ద నేరుగా పత్తి కొనుగోలు చేస్తున్నారు.

పొడుగు పింజ పత్తి కనీస మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.6380 కాగా మార్కెట్‌లో రూ.8 వేలకు పైగా ధర ఉంది. అధిక వర్షాలతో పత్తి నాణ్యత కొంత దెబ్బతిందని అంచనా వేస్తున్నారు. నాణ్యత తక్కువ వున్న పత్తికి క్వింటాళ్‌కు రూ.6 వేలు వరకు ప్రైవేటు వ్యాపారులు చెల్లిస్తున్నారు. నాణ్యతగా ఉన్న పత్తికి క్వింటాలు రూ.7 నుంచి 8 వేలు వరకు రైతులకు ఇచ్చి కొనుగోలు చేయడం వల్ల ఇక రైతులు సిసిఐ కేంద్రాల వైపు కనెత్తి చూడటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. సిసిఐ కొనుగోలు జరపకపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. పత్తి కొనుగోలు లేక సెస్సు రాక మార్కెట్‌ కమిటీలకు ఆదాయం బాగా తగ్గిపోతోంది.

రెండు జిల్లాల్లో 3.64 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పత్తి విస్తీర్ణం పెరిగినా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో మాత్రం పెరగలేదు. ఈ రెండు జిల్లాల పరిధిలో సాధారణ పత్తి విస్తీర్ణం 4.64 లక్షల ఎకరాలు కాగా ఈ ఏడాది లక్ష ఎకరాల వరకు తగ్గింది. రెండేళ్ల క్రితం ధర లేక విస్తీర్ణం తగ్గించారు. ఇదే పరిస్థితి ఈ ఏడాది కూడా కొనసాగింది. మరో వైపు మొదట్లో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. మొదటి తీత సమయంలో అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. నాలుగు క్వింటాళ్లు వస్తుందనుకున్న పొలాల్లో రెండు క్వింటాళ్లే వచ్చింది. వాతావరణం అనుకూలిస్తే రెండు మూడు తీతల్లో దిగుబడి పెరగవచ్చునని భావిస్తున్నారు. ఇప్పటి వరకు అధిక వర్షాలు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉన్నాయి. మూడ్రోజులుగా వాతావరణం మారింది. ఎండలు పెరుగుతున్నాయి. దీంతో పత్తిపైరు పరిస్థితి మారుతుందని భావిస్తున్నారు.

త్వరలోనే ధాన్యం కొనుగోలు



- 150 ఆర్‌బికెల పరిధిలో 55 టన్నుల కొనుగోలు లక్ష్యం
- ఈ-క్రాప్‌ ఆధారంగానే.. - తేమ 17 శాతం లోపే ఉండాలి
- వివరాల నమోదులో ఒక్కోచోట ముగ్గురు వాలంటీర్లు
- ప్రజాశక్తితో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ లక్ష్మీ

8లో

రాజధాని మాస్టర్‌ ప్లాన్‌లో మార్పులు తగవు

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 11న సిఆర్‌డిఎ కార్యాలయాల్లో వినతులు
- అమరావతి పరిరక్షణ సమితి జెఎసి నిర్ణయం

వార్త మెయిన్‌లో

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారం వాల్లిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మేడికొండూరు మండలం భీమినేనివారిపాలెం వద్ద ద్విచక్ర వాహనాన్ని పత్తి లోడు ట్రాక్టర్‌ ఢీకొని ఒకరు మృతి చెందగా పని నుండి ఇంటికెళ్తూ రోడ్డు దాటే క్రమంలో ఆటో ఢీకొన్న హోటల్‌ కార్మికులురాలు దుర్మరణం పాలైంది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి బస్సు మెట్లపై కూర్చోగా స్పీడ్‌ బ్రేకర్‌పైకి బస్సు ఎక్కడంతో జారీపడి అక్కడికక్కడే దుర్మణం పాలైన ఘటన కారంపూడిలో చోటుచేసుకుంది.

3లో

చిట్టీలని నమ్మించి.. సొమ్ముతో పరారీ..

- 14 మంది వద్ద నుండి 15.95 లక్షల వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి - తాడికొండ

నమ్మకంగా ఉంటూ చిట్టీలు కట్టించుకున్న వారు చివరికి తమను మోసం చేశారని, పైగా బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు. ఈ మేరకు తాడికొండ పోలీసులుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండకు చెందిన షేక్‌ ఫాతిమా తన ఇంటివద్ద ఉన్న మహిళలతో చీటీలు వేసుకుందాం అని చెప్పింది. కొంచంకొంచం డబ్బులు దాచుకుంటే పిల్లల చదువులకు ఉపయోగంగా ఉంటుందంటూ నమ్మించింది. గతేడాది కొంత మందితో ఒక గ్రూపులను ఏర్పాటు చేసి రూ.2 లక్షల చిట్టీలు నిర్వహించింది. ఇందుకోసం సభ్యుల నుండి నెలకూ రూ.5 వేలు చొప్పున వసూలు చేస్తోంది. ఈ మధ్య సభ్యులు తమ డబ్బు గురించి అడగగా.. భద్రంగానే ఉన్నాయని, ఇస్తానని చెబుతూ వస్తోంది. అయితే నెల రోజులుగా ఆమె కనిపించకుండా పోవడంతో బాధితులు ఆమె ఇంటికి వెళ్లి ఆమె భర్త, మామను అడిగారు.. ఇంట్లో లేదని, వేరే ఊరు వెళ్లిందని వారు చెప్పారు. చివరకు వేజెండ్లలో ఉందని తెలిసిన బాధితులు మళ్లీ ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఆమె భర్త, మామతో మాట్లాడారు. వేజెండ్లలో ఉన్న ఆమె వద్దకు వెళ్లి డబ్బుల విషయం మాట్లాడదామని అడిగారు. ఇందుకు వారు నిరాకరించడంతోపాటు తమ వద్ద డబ్బుల్లేవని, ఏం చేస్తారో చేసుకోండని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు డబ్బు ఇవ్వకపోగా చంపుతామంటూ బెదిరించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

కాలేజీ భూమి కబ్జాపై కదలిక

- అనుమతి లేకుండానే స్టేడియం నిర్మాణం
- హైకోర్టు ఆదేశాలను విస్మరించి నిధులు కేటాయించిన మున్సిపల్‌ కౌన్సిల్‌
- ఉల్లంఘనలపై డిఆర్‌సిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ కెఎస్‌
- ఎట్టకేలకు ప్రాథమిక విచారణ చేపట్టిన కమిటీ



విచారణ చేస్తున్న కమిటీ

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి కబ్జాకు గురవుతోందని కాలేజీ విద్యార్థులు అనేకసార్లు విన్నవించుకున్న పట్టించుకోని అధికారులు హైకోర్టు ఆదేశాలు, దీనిపై జిల్లా సమీక్ష సమావేశం (డిఆర్‌సి)లో ఎమ్మెల్సీ కెఎస్‌ లక్ష్మణరావు ప్రశ్నించడంతో కదిలారు. వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూ అక్రములపై విచారణ కోసం జాయింట్‌ ఇన్‌స్పెక్షన్‌ కమిటీని ఏర్పాటు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ ఆదేశించారు. కమిటీకి అధికారిగా పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌ వసంతబాబు, సభ్యులుగా కళాశాల ప్రిన్సిపల్‌, వినుకొండ తహశీల్దార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ నియమితులయ్యారు. ప్రాథమిక

2లో



కాలేజీ స్థలంలో నిర్మాణంలో ఉన్న స్టేడియం ముఖద్వారం



మాట్లాడుతున్న మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సత్య కుమారి

పాన్ ఇండియాపై అవగహన

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

న్యాయ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగిఉండాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ సత్యకుమారి అన్నారు. ఆదివారం మాచవరంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పాన్ ఇండియా అవగాహన కార్యక్రమంలో జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చైర్మన్ సత్య కుమారి పాల్గొని ప్రసంగించారు. గ్రామస్తులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలను అవగాహన కలిగి ఉండటం ద్వారా సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అవగాహనతోనే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కలిగించే కరపత్రాలను గ్రామంలో పంచారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ ఏ ఆర్ కే ఎస్ టి సాయి, నక్క కష్ణ, పారా లీగల్ వాలంటీర్లు రమేష్, మహమ్మద్ తజ్మూల్ బేగ్, మహమ్మద్ జిలాని, షేక్ ముజీర్, కోర్టు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఇప్పటం రైతులు,

ఇప్పటంలో వాస్తవాలు తెలిసుకోని మాట్లాడాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వైసిపి వాస్తవాలు బయట పెట్టకుండా, జనసేన పార్టీ పైన, రైతుల పైన జరిగిన ఘటనను వక్రీకరిస్తూ మాట్లాడటం సరైన పద్ధతి కాదని, జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని ఇప్పటంలో జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చిన రైతులతో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే, కక్ష సాధింపు చర్యలను వైసిపి ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం రూ.50 లక్షలను ప్రకటించాడని అన్నారు. వాస్తవాలను వక్రీకరించి ఇక్కడ రైతులే లేరని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. జనసేన తాడేపల్లి మండల కార్యదర్శి తిరుమల శెట్టి శ్రీధర్, జనసేన యర్రబాలెం గ్రామ అధ్యక్షులు కాపరౌతు సుందరయ్య, సాదు చంద్రశేఖర్, బాబి తదితర రైతులు తదితరులు పాల్గొన్నారు.

కక్ష్య సాధింపు కోసమే ఇళ్ల కూల్చివేత

ప్రజాశక్తి మంగళగిరి

పార్టీ ఆవిర్భావ సభకు భూములిచ్చారనే కక్షతోనే పోలీసులు పవన్ కళ్యాణ్‌ను ఇప్పటం వెళ్లకుండా అడ్డుకున్నారని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటంలో కేవలం గోడలు తొలగించినట్లు వైసిపి నేతలు చెబుతున్నారని కానీ వాస్తవానికి గ్రామాన్ని వల్ల కాడులా మార్చారని విమర్శించారు. వైసిపి మంత్రులు ఇప్పటం వస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయ శేఖర్, మహిళా కో-ఆర్డినేటర్ పార్వతి, నాయకులు కాపరౌతు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

143 జిఒ అమలు చేయడం సరికాదు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

వైద్య ఆరోగ్య శాఖలో పర్యవేక్షక సిబ్బంది సర్దుబాటు ప్రక్రియలో రాష్ట్ర స్థాయి అధికారులు సరైన విధి విధానాలు రూపొందించకుండా 143 జిఒను అమలు చేయాలని చూడటం సరికాదని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.సాంబయ్య అధ్యక్షతన జిఒ 143పై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.ఆర్.ప్రసాదస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఆనందరావు, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు. పర్యవేక్షక సిబ్బందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సర్దుబాటు చేయటంలో సరైన ప్రామాణికాలు పాటించట్లేదని, దీని వల్ల 30 ఏళ్లకు పైగా పనిచేసిన ఉద్యోగులను జిల్లా స్థాయిలో సర్దుబాటు చేయకుండా, జోనల్, రాష్ట్ర స్థాయిలో సర్దుబాటు చేయటం చాలా అన్యాయమన్నారు. కనుక అధికారులు సర్‌ప్లస్ స్టాఫ్‌ను ఎక్కడ సర్దుబాటు చేస్తారో ముందుగానే విధివిధానాలు ప్రకటించి, కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. లేని ఎడల జోనల్, రాష్ట్ర స్థాయిలో జరిగే కౌన్సెలింగ్‌ను అడ్డుకుంటామని నాయకులు హెచ్చరించారు.



వెయ్యి మందికి అన్నదానం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

బాపూజీ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో గ్యార్మి సందర్భంగా ఆదివారం కొప్పాక మున్సిపల్ కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.మార్కెట్‌లో గౌస్ నేతృత్వంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. శ్రీశ్రీశ్రీ హాజరత్ మహబూబ్ సుభాని గౌస్ ఆజమ్ దస్తగిరి మహాత్ముల వారి గ్యార్మి షరీఫ్ పండగ. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టి ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఈ కార్యక్రమంలో జానపాటి శ్రీనివాస్,బాగిరెడ్డి,కష్ణారెడ్డి, అగ్గల్ బెగ్,మొల్ల కరీం, షేక్ బాబావలి, చదలవాడ లక్ష్మయ్య, పటాన్ ఫైరోజ్,షేక్ రఫీ,షేక్ బాజీ సాహెబ్, షేక్ సందని పాల్గొన్నారు

కాలేజీ భూమి కబ్జాపై కదలిక

(మొదటి పేజీ తరువాయి)



స్టేడియం నిర్మాణం నేపథ్యంలో భూమిని చదును చేయాడానికి తెచ్చిన గ్రావెల్

విచారణ చేపట్టిన కమిటీ..38 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి కొంత ఆక్రమణ గురికాగా మరికొంత భూమిలో వినుకొండ పురపాలక సంఘం అనుమతులేమీ లేకుండా క్రీడా వికాస కేంద్రం నిర్మాణం చేపట్టిందని, ఇది భవిష్యత్తులో కళాశాల విస్తరణకు సమస్యగా మారుతుందని కమిటీ దృష్టికొచ్చింది. కాలేజీ భూమి ఆక్రమణలు, అందులో చేపట్టిన అనధికారిక నిర్మాణాలపై కమిటీ వివరాలు సేకరించింది.

వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమి 38 ఎకరాలు కాగా గతంలో కొందరు కొంత భూమిని ఆక్రమించారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు ఏకంగా దొంగ పట్టాలు పుట్టించి భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. అటువంటి వ్యక్తుల నుండి భూమిని కాపాడామన్న పాలకులు, అధికారులే మళ్లీ ఆక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి.

ఉన్నత విద్యాశాఖ అనుమతుల్లేకుండా వినుకొండ మున్సిపల్ అధికారులు స్టేడియం నిర్మాణాన్ని అనధికారికంగా చేపడుతున్నారు. తమ కళాశాల భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గతంలో అనేకసార్లు కాలేజీ విద్యార్థులు ఆందోళన చేపట్టి ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. దీనిపై ఆరు నెలల క్రితం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ స్వయంగా కాలేజీని సందర్శించారు. అయితే చర్యలేమీ తీసుకోకపోవడంతో విద్యార్థి సంఘాల నాయకులు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. గత నెల 17వ తేదీన కోర్టు చేపట్టిన విచారణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని మున్సిపల్ అధికారులు ఆక్రమించి నిర్మిస్తున్న స్టేడియం నిర్మాణ పనులను నిలిపేసి యథాతథ స్థితి (స్టే) పాటించాలని మద్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

గతనెల పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆక్రమణలపై ప్రశ్నించారు. అనుమతులు లేకుండా అనధికారికంగా స్టేడియం నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని చెప్పారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ శివశంకర్ విచారణకు కమిటీ ఆదేశించారు.

మరోవైపు హైకోర్టు ఆదేశాలనూ విస్మరిస్తూ గతనెల 28వ తేదీన వినకొండ పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనధికారికంగా నిర్మిస్తున్న స్టేడియం నిర్మాణానికి రూ.70 లక్షల ఖర్చు చేసేందుకు తీర్మానించారు. ఈ క్రమంలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ విచారణ ప్రాధాన్యాన్ని సంతరించకుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిని అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలనే ఉద్దేశం ఉంటే కాలేజీ చుట్టూ ప్రహరీ నిర్మించాలేగాని అనధికారికంగా నిర్మాణాలు ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సంకల్ప యాత్ర సంబరాలు



తాడేపల్లిలో కేక్ కట్‌చేస్తున్న వేణుగోపాలసోమిరెడ్డి

ప్రజాశక్తి- దుగ్గిరాల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంకల్ప యాత్రచేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండల వైసిపి నాయకులు మండల కేంద్రం దుగ్గిరాలలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. రైలు పేటలోని మాజీ సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ వైయస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి జెడ్పిటిసి మేకతోటి అరుణ యాడ్ సెక్రటరీ షేక్ బాజీ దానబోయిన వెంకటేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వర నాయక్ గాలం ఫణీంద్ర షేక్ నాగూర్ జూపూడి జాన్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజాసంకల్పయాత్ర అభినందనీయమని వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి చెప్పారు. తాడేపల్లి పట్టణంలోని మాజీ సిఎం వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి మేకా వెంకటరామిరెడ్డి, ఎస్‌సిసెల్ కార్యదర్శి సిహెచ్.దుర్గారావు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ అధ్యక్షులు ఎం.ప్రకాష్, డి.అనీల్, దాసు, ఎస్.పార్వతి, ఎస్‌డి.రసూల్, పి.సాంబశివరావు, బి.భాస్కరరెడ్డి, కిశోర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వేల కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలోనే ఒక మరుపురాని ఘట్టమని మేడికొండూరు జడ్‌పిటిసి సభ్యులు కందుల సిద్దయ్య అన్నారు. మేడికొండూరులో మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆదివారం సంకల్ప యాత్ర సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్న రాజేష్, ఎంపీటీసీ కొలకలూరి సామ్రాజ్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తుళ్లూరు

ప్రజాహితం కోసమే జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించారని ఎమ్మెల్యే డాక్టర్ వుండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు.ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం బోరుపాలెం గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి..వృద్ధులకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాదల మహేంద్ర,బుర్రా శివారెడ్డి,ఆలూరి శ్రీనివాసరావు,చను మోలు రామారావు, తుమ్మూరు వర ప్రసాద్ రెడ్డి,తురకా శ్రీను,బండ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆది వారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. వీటిపై వివరాల ప్రకారం...


కొమ్మూరు రత్నాకర్


మాచర్ల ఇమ్మానియేల్


గుదిబండి కుమారి

ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టి..

ప్రజాశక్తి - మేడికొండూరు

ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుకగా వస్తున్న పత్తి లోడు ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని భీమినేని వారిపాలెం వద్ద ఆదివారం జరిగింది. కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన కొమ్మూరి రత్నా కర్, మేడికొండూరులోని తమ బంధువుల వద్దకు వచ్చాడు. మేడికొండూరు నుండి తన బావను ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి రైల్వేస్టేషన్ కి తీసుకువెళ్లి అక్కడ వదిలిపెట్టాడు. తిరిగి మేడికొండూరుకు వస్తుండగా భీమినేనివారిపాలెం సమీపానికి వచ్చే సరికి వెనకగా వస్తున్న ట్రాక్టర్, ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్రవాహ నంపై ప్రయాణిస్తున్న కొమ్మూరు రత్నాకర్(56) కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సహాయంతో స్థాని కులు అతన్ని గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాద ఘటనపై మేడికొండూరు ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బస్సు మెట్లపై నుండి జారిపడి..

ప్రజాశక్తి - కారెంపూడి

బస్సు మెట్లపై నుండి కింద పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సెయింట్ జాన్స్ స్కూల్ ఎదురుగా ఉన్న స్పీడ్ బేకర్ వద్ద ఆదివారం చోటు చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మాచర్లకు వస్తున్న తరుణంలో మెట్లపై కూర్చున్న మాచర్లకు చెందిన మాచర్ల ఇమ్మానియేల్ (37) జారి పడ్డాడు. వైద్యం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొం దుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు.

పనికి వెళ్లి వస్తూ మహిళ..

ప్రజాశక్తి-కొల్లిపర

ఆటో ఢీకొని ఒక మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రమైన కొల్లిపరలో జరి గింది. నెలకొంది పోలీసుల వివరాల ప్రకారం కొల్లి పరకు చెందిన గుదిబండి కుమారి (46) స్థానిక శివారెడ్డి హోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. సాగిస్తోంది. ఆదివారం రాత్రి పని ముగించుకొని ఇం టికి వెళ్లే సమయంలో కొల్లిపర హై స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా కొల్లిపర నుండి తెనాలి ఆటో ఢీకొనగా కుమారి అక్కడక్కడ మృతి చెందినట్లు తెలిపారు మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.రవీంద్రారెడ్డి తెలిపారు

నదిలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - దుగ్గిరాల



మండలంలోని పెదకొండూరు దళిత వాడకు చెందిన యువ కుడు శుద్ధపల్లి రాఘ వులు (27) కృష్ణా నదిలో గల్లంతయ్యాడు. ఆదివారం సాయంత్రం మూడు గంటల సమయంలో లంకల్లో మేతకు వెళ్లిన గేదెలను తోలుకు వచ్చేందుకని తన స్నేహితుడు కిరణ్ తో కలిసి అక్కడికి వెళ్లేం దుకని నది దాటుతుండగా ప్రమాదవశాత్తు వాళ్లిద్దరూ ప్రమాదంలో చిక్కుకుపోయారు. ప్రతిరోజు వెళ్లే మార్గంలో కాకుండా మరో మార్గంలో వెళుతుండగా ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. కిరణ్ అతికష్టం మీద గట్టుకు చేరుకోగా రాఘవులు మాత్రం గల్లంతయ్యాడు. ఈ సమాచారంతో స్థానికులు అధిక సంఖ్యలో సంఘటన స్థలానికి వెళ్లి నప్పటికి ఫలితం లేదు.తహశీల్దార్ కె.మల్లేశ్వరి, ఎస్సై ఎ. శ్రీనివాసరెడ్డి హుటాహుటిన సంఘ టనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-మేడికొండూరు

పేకాట స్థావరంపై ఆదివారం మేడికొం డూరు పోలీసులు మెరుపు దాడి చేశారు. మం డల కేంద్రమైన మేడికొండూరు పశువుల ఆసు పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పేకాట ఆడు తున్న సమాచారం పోలీసులకు అందింది. ఈ నేపథ్యంలో స్థావరంపై పోలీ సులు దాడి చేసి నిర్వాహకులను, పేకాట ఆడు తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 6,360 స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు నజీరు, గోపాలకృష్ణ, డేవిడ్ పాల్గొన్నారు.

152 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

152 మందికి కంటి పరీక్షలు నిర్వ హించారు. మండలంలోని లింగంగుంట్ల లో పూర్ణ చంద్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్నారై మెడికల్ కాలేజ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 50 మందికి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారించారు.

మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి - తాడికొండ



తాడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడ్డ అక్రమ మద్యం సీసాలను డిఎస్పి పోతురాజు ఆధ్వర్యంలో ఆదివారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో 13 కేసులలో స్వాధీనం పరచుకున్న అరవై ఐదు వేల ఎనిమిది వందల రూపాయల విలువ కలిగిన 658 మద్యం సీసాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్వంసం చేశామన్నారు. కార్య క్రమంలో సిఐ జి.శ్రీనివాసరావు ఎస్ఐలు నరసింహ, నాగార్జున సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా కొమ్మలపాటి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెంలో పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ 58వ జన్మదిన వేడుకలను గ్రామ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన భారీ కేకును నాగిరెడ్డిపాలెం మాజీ ఎంపీటీసీ టి.కిచ్చారెడ్డి,వెన్న సీతారామిరెడ్డి సంయుక్తంగా గ్రామ నాయకుల సమక్షంలో కట్ చేసి పంచి పెట్టారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ బూతుకూరి తిరుపతిరెడ్డి,వెన్న వెంకట్ రెడ్డి, బద్దూరి వీరారెడ్డి, బూతుకూరి గోవిందరెడ్డి, సత్యనారాయణ,మన్నెం వెంకటేశ్వర్లు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కారెంపూడి

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే న్యాయసలహా సదస్సులను ఏర్పాటు చేయటం జరుగు తుందని గురజాల సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. ఆదివారం మండలంలోని పేట సన్నేగండ్లలో న్యాయసేవ కమిటీ గురజాల వారి ఆధ్వ ర్యంలో జరిగిన న్యాయ సలహా సదస్సులో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించినటువంటి ప్రాథమిక హక్కులను కుదించి ప్రజలకు అయన వివరించారు. తమను తాము కాపాడుకోవటానికి చట్టాల పట్ల అవగాహన కలిగి ఉం డాలన్నారు. సదస్సులో న్యాయ వాదులు చల్లా.రామిరెడ్డి, కొంగర.హరిసత్యనారాయణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి. వీరభద్రుడు,షేక్.జానీభాషా, చితిరాల.కోటేశ్వరరావు, రామాంజనేయులు,మస్తాన్,ఆర్ఐ కీర్తిస్రవంతి, విఆర్ఓ,గ్రామస్తులు, కారెంపూడి ఎస్ఐ ఎం. రామాం జనేయులు, కోర్టు కానిస్టేబుల్ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నుల భారం మోపిన అసమర్థ వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

అభివృద్ధి చేతగాని అసమర్థ వైసిపి ప్రభుత్వం ప్రజలపై అధిక పన్నుల భారాన్ని మోపి, దోచుకుంటోందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. బొల్లాపల్లి మండలంలోని వెంకటరెడ్డిపురం తండా, జయంతి రామపురం గ్రామంలో బాదుడే- బాదుడు ఆదివారం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా హాజరైన జీవి ఆంజనేయులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదవానికి ఒక ఇల్లు కూడా ఇవ్వడం చేతగాని జగన్ రెడ్డి ప్రభుత్వం ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను అంటూ పన్నులు మోపటమే కాకుండా, విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజల నుండి దోచుకుంటున్నారని విమర్శించారు. నిత్యవసరాల ధరలు పెరిగి పేద ప్రజల జీవనం కష్టతరంగా మారితే నియంత్రించాల్సిన ప్రభుత్వం మరింత చార్జీలు, పన్నులు పెంచి ప్రజల నడ్డి విరుస్తోం దన్నారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి దుష్టపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జరపల గోవిందు నాయక్, పెమ్మసాని నాగేశ్వరావు, వెంకటనారాయణ, బారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, గోవిందరాజులు, నిమ్మకాయల బాబురావు తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో ఎస్టీ గురుకులం బాలికల ప్రతిభ

ప్రజాశక్తి - కారెంపూడి

నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలలో మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలికల)కు చెందిన విద్యార్థులు పథకాలను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వై.శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. పాఠశాల ఆవరణలో జరిగిన క్రీడాకారిణుల అభినంద సభలో ఆయన మాట్లాడుతూ అండర్ -14, 17 విభాగాలలోని కబాడీ పోటీలలో హర్షిణి, దుర్గ, శివలక్ష్మి, సింధు, విమల, ఉత్తమ ప్రథమ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.మాచర్లలోని సెయింట్ ఆన్స్ జరిగిన అండర్ -17 విభాగంలోని 400 మీటర్ల పరుగు పందెంలో ఆర్.ప్రమీలబాయి ప్రథమ స్థానం, జె.హర్షిణిబాయి ద్వితీయ స్థానం, అండర్ -14 విభాగం 200 మీటర్ల పరుగు పోటీల్లో గంగోత్రి బాయి ద్వితీయ స్థానం, హర్షిణిబాయి తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. క్రీడాకారిణులను వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శివపార్వతి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.ప్రమీల అభినందించారు.



పల్నాడులో వైసిపి ఎమ్మెల్యేల అక్రమార్జన

టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడులో వైసిపి ఎమ్మెల్యేలు అక్రమార్జనకు పాల్పడుతున్నారంటూ జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు ఆరోపించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జివి మాట్లాడుతూ అక్రమార్జనే ధ్యేయంగా ఉన్న వైసిపి ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి, బియ్యం, గుట్కా, మద్యం మాఫియాను నడుపు తున్నారని, వాగులు వంకలు, కుంటలు, పంట కాలువలను సైతం వదలకుండా భూ కబ్జాలు, అక్రమ వెంచర్లతో సహజ వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వందల కోట్ల రూపాయలను అక్ర మంగా సంపాదిస్తూ, దోపిడి సొమ్ముతో తిరిగి ఎన్నికలకు వచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. ఇటు వంటి అరాచకశక్తులకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగ న్మోహన్‌రెడ్డి తమ ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గాలలో దోచుకోమని ప్రోత్సహిస్తుండటంతో సహజవనరులతో పాటు ప్రజల ఆస్తులను కూడా దోచుకుంటున్నారని ఆరోపించారు. వైసిపి ఎమ్మెలేల దుర్మార్గాలపై ప్రతిపక్షాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సామాన్యులకు ఇసుక అందుబాటులో లేని పరిస్థితి నెలకొందన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, అక్రమాలపై టిడిపి పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. విభిన్నప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గృహనిర్మాణాలు, ఇనుము, సిమెంట్, ఇసుక, ఇంటి నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల, మద్యపాన నిషేధం, బెల్టుషాపుల అంశాల గురించి ప్రస్తావించారు. సమా వేశంలో రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి జి. జనార్దన్‌బాబు, పార్లమెంట్ కార్యదర్శి షేక్ రఫీ, పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జగ్గా రావు, గోపువారిపాలెం సర్పంచ్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమల దరువు.. మందులు కరువు

- చిలకలూరిపేటలో అంతంతమాత్రంగా పారిశుధ్యం
- ప్రభుత్వాసుపత్రిలో డెంగీ నిర్ధారణకు పరీక్షలు లేవు
- అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణం 'ఎ1' గ్రేడ్ మున్సిపాలిటి. ఇక్కడ అందుకు తగ్గ పారిశుధ్యం నిర్వహణ సరిగా లేదని ప్రజ లంటున్నారు. అనేక ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్లక్ష్యంగా, దారుణంగా ఉందంటు న్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలు కాన రావడంలేదన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు. స్థానిక గణపవరం, పసుమర్రు మానుకొండువారిపాలెంతో కలవుకొని 38 వార్డులు ఉన్నాయి. పట్టణంలో జనాభా సుమారు లక్ష మంది ఉంటారు. నిత్యం పల్లెల నుంచి 20 నుంచి 30 వేల మంది ప్రజలు ఇక్కడికి వచ్చిపోతుంటారు. పారిశుధ్య నిర్వహణ నిమిత్తం చల్లే బ్లీచింగ్ కూడా ప్రత్యేకదినాల్లో,మంత్రుల పర్యటనలు ఉన్నప్పుడు మాత్రమే వాడుతున్నారు. ఫాగింగ్ సంగతి సరేసరి, దీని గురించి ప్రజలు ఎప్పుడో మరచిపోయారు. 38 వార్డుల్లో దాదాపు ఎనిమిది వందల మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి కానీ మూడు వందల మందే ఉన్నారు. వీరిపై పనిభారం పడుతోంది. తక్కువ సంఖ్యలో ఉన్న పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు విషజ్వరాల బారినపడి ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో డెంగీ వ్యాధి నిర్ధారణకు చేసే పరీక్షలు గాని, దీనికి సంబంధించి మందులు గానిలేవని స్వయంగా అక్కడి వైద్యులే చెబుతున్నారు. మలేరియా వ్యాధి వంటివి వస్తే రోగులను గుంటూరు పంపుతున్నా రని, టై ఫాయిడ్ బారిన పడ్డ వారికి నామ మాత్రంగా ఇక్కడ వైద్యం జరుగుతోందని, మందులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. ఈస్ట్‌క్రిస్టియన్‌పేటలోని కుంట, పురుషోత్తమ పట్నంలోని గుడిపూడిజంగాల నివాసం వద్ద ఉన్న చెరువులను పూడ్చాలని కొన్నేళ్లుగా అడుగుతూనే ఉన్నామని స్థానికుడు విభూది సుబ్బారావు అన్నారు. కొద్దిపాటి వర్షం వస్తే వర్షపు నీరు ఇళ్ళలోకి వస్తుం దని, ముఖ్యంగా దోమలు, పందుల సం చారం ఇక్కడ ఎక్కువగా ఉందని చెప్పారు. సమస్యలు పరిష్కారిస్తామని అధికారులు, నాయకులు మాటలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, రోడ్డు, తాగునీరు,విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



ఈస్ట్‌క్రిస్టియన్‌పేటలోని కుంట, పురుషోత్తమపట్నంలోని చెరువు



దోమల పెంపక కేంద్రంగా మార్చారు..

పారిశుధ్య నిర్వహణ సరిగ్గా ఉంటే కొద్దిపాటి వర్షాలకే వీధులన్నీ ఎందుకు జలమయమవుతాయని సి.పి.ఎం. పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంక టేశ్వర్లు పశ్నించారు. పల్లెలోని చెరువు, గుడిపూడి జంగాల ఇళ్ల వద్ద ఉన్న చెరువు పూడ్చి వేత గురించి ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా ఒక సారైనా సమాధానం ఉందా? అని అధికారులను ప్రశ్నించారు. వార్డుల్లో, కాల నీల్లో, మురికివాడల్లోని కాలువల తీరు గురించి ఆయన ప్రశ్నించారు. దోమల నివారణ కాదు.. దోమల పెంపకం కేంద్రంగా పట్టణాన్ని మార్చారని విమర్శించారు.



మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

విద్యుత్ మీటర్లు బిగించే నిర్ణయం వెనక్కి తీసుకోండి

ప్రజాశక్తి- క్రోసూరు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పెరికపాడు రైతు సంఘం గ్రామ కమిటీ తీర్మానించింది. పెరికపాడులో రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి బయ్యవరపు కోటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. పల్నాడు జిల్లా రైతు సంఘం కార్యదర్శి వై.గోపాలరావు మాట్లాడుతూ దేశ మొత్తం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండి ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు, గిట్టుబాటు ధర చట్టం అమలు చేసి రైతులను ఆదుకోవాల్సింది పోయి కార్పొరేట్ వ్యవసాయానికి బాటలు వేసేందుకు ఈ వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించే నిర్ణయాన్ని ముం దుకు తీసుకువచ్చారని విమర్శించారు. వ్యవసాయ నల్ల చట్టాలు అమలు చేసి రైతులు పక్కకు పోయేలా నిర్ణయాలు చేయడం కేంద్ర ప్రభుత్వ అవకాశవాదానికి నిదర్శన మన్నారు. రైతు సంఘం నాయకులు ఆవుల ఆంజనేయులు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ కౌలు రైతుల్లో దాదాపు 80 శాతానికి పైగా సన్న, చిన్న రైతులుగానే ఉన్నారని, ఇలాంటి విధానాలను తిప్పికొట్టడంలో కౌలు రైతులందరూ కూడా కలిసి రావాలని అప్పుడే వ్యవసాయాన్ని కాపాడుకోగలమని అన్నారు. సమావేశంలో బాణావత సక్రియ నాయక్, ఆవుల రాం బాబు బయ్యవరపు సదాశివరావు, పానుగోతు కోటి నాయక్, సాగి వెంకటేశ్వర్లు, ఉప్పు శ్రీనివాసరావు, బయ్యవరపు శ్రీకాంత్, రైతు సంఘం గ్రామ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి : సిఐటియు

ప్రజాశక్తి- వినుకొండ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను కార్మికులు కలిసికట్టుగా తిప్పికొట్టాలని సిఐ టియు పల్నాడు జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి పిలుపు నిచ్చారు. వినుకొండ పట్టణ సిఐటియు మహాసభ ఎం.తిరుమలలక్ష్మి అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ఆది వారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హనుమంతరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కు లను కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. హక్కుల సాధన కోసం కార్మికులు కలిసి ఉద్యమించాలన్నారు. అనంతరం 9 మందితో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటి అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. తిరుమల లక్ష్మి, ఎ. ఆంజనేయులు, మరో ఏడుగురు సభ్యులతో కమి టీని ఎన్నుకున్నారు. సమావేశంలో బొంకూరి వెంకటేశ్వర్లు, షేక్ రంజాన్ బి, షేక్ నాసర్ బి, నాగేంద్రుడు, ఏ.లక్ష్మీ ప్రసన్న, నాగమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



క్షౌరవృత్తి రంగంలోకి 'రిలయన్స్'ను వ్యతిరేకించాలి

- లక్షలాది మంది జీవనం సాగిస్తున్నారు
- మా కులవృత్తిపై దాడి తగదు
- ఎపిలో లైసెన్స్‌లు ఇవ్వొద్దు
- నాయి బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్

ప్రజాశక్తి -అమరావతి

క్షౌరవృత్తి రంగంలోకి అడుగుపెట్టిన బడా కార్పొరేట్ సంస్థ 'రిలయన్స్'ను వ్యతి రేకించాలని ఎపి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అమరావతి అధ్యక్షుడు ఉంగు టూరు నిబద్ది అన్నారు. ఆదివారం విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది జీవనం సాగిస్తున్న ఈ రంగంలోకి రిలయన్స్ రావడం ద్వారా తమ కులవృత్తిపై దాడి చేస్తోందని అన్నారు. రిలయన్స్ కంపెనీ ఇప్పటికే ప్రముఖ నగరాలలోని ఆరు వందల క్షౌర వృత్తి షాపుల్లో తన స్థానాన్ని ఏర్పరచుకుం దన్నారు. రిలయన్స్ అధినేత అంబాని మరో మూడు వేల షాపుల విస్తరణకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని, దీని పై నాయి బ్రాహ్మణులు వాపోతున్నా రని అన్నారు. రిలయన్స్ కంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లో అవకాశం కల్పించకూడదని, కార్పొరేట్ సంస్థలకు లైసెన్సులు రాకుండా అడ్డుకోవాలని వైసిపి ప్రభుత్వానికి నాయి బ్రాహ్మణుల కుటుంబీకులు విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తిపై స్పందించనిపక్షంలో రిలయన్స్ సంస్థలను రాష్ట్రంలో అడుగు పెట్టనీయకుండా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బి..సుబ్బు, పి.హనుమంతు, ఎం.సాంబశివరావు, సిహెచ్.శివప్రసాద్, బి. సూరిబాబు తది తరులు పాల్గొన్నారు.



సింహాద్రి స్వర్ణ సంస్మరణ సభలో మాట్లాడుతున్న పి.మధు, సింహాద్రి ఝాన్సీ, వై.వెంకటేశ్వరరావు, బి.తులసిదాస్, పాశం రామారావు



నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు

పోరాటాల కాలంలో స్వర్ణ మరణం బాధాకరం

- ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఆమె స్ఫూర్తితో ఉద్యమాలు
- సింహాద్రి స్వర్ణ సంస్మరణ సభలో నాయకులు
- చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం కార్యకర్త, ఐద్వా నాయకులు సింహాద్రి స్వర్ణ సంస్మరణ సభ మండలంలోని కాజా గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, సీనియర్ నాయకులు పి.మధు, సిపిఐ ఎంఎల్ నాయకులు సింహాద్రి ఝాన్సీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, సిహెచ్ నర్సింగరావు, బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పూలమాలలేసి నివాలులర్పించారు. స్వర్ణ కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బి.కోటేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సభలో మధు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి కార్యకర్తల గుండెకాయని భావించి నిరంతరం వారి సంరక్షణ గురించి స్వర్ణ ఆరా తీసేవారిని చెప్పారు. ప్రజలపై పాలకులు తీవ్రమైన భారాలు మోపుతుండగా వాటికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించాల్సిన క్రమంలో పోరాట వారసత్వం గల కుటుంబానికి చెందిన స్వర్ణ మృతి చాలా బాధాకరమన్నారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పదని, వాటిని స్వర్ణ స్ఫూర్తితో చేయాలని అన్నారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ స్వర్ణ మంచి ఆదర్శవంతమైన మహిళన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, బి.తులసీదాస్, సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు కుటుంబాల్లో మహిళలకు ఎంతో ప్రాధాన్యతన ఉంటుందని, అటువంటి వారసత్వం స్వర్ణ కుటుంబంలో కొనసాగిందని అన్నారు. సమాజంలో మహిళకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తోటి వారితో ఎంత అప్యాయంగా మెలగాలో స్వర్ణను చూస్తే తెలుస్తుందని చెప్పారు. ఐద్వాలో పని చేసే క్రమంలో ఆమె సేవలను విశాఖలోనూ అందించారని గుర్తు చేశారు. సాంస్కృతికంగా ఎన్నో దాడులు జరుగుతున్న క్రమంలో అందుకు భిన్నంగా నిలిచిన కుటుంబానికి చెందిన స్వర్ణ చనిపోవడం బాధాకరమన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ సిపిఎం అభ్యున్నతితో సింహాద్రి శివారెడ్డి, ఆ కుటుంబం పాత్ర ఎనలేనిదన్నారు. ప్రస్తుత కాలంలో భిన్నమైన రాజకీయాలను చూస్తున్నామని, ఓట్ల కోసం డబ్బులతో ప్రలోభపెట్టడం, ప్రజాప్రతినిధుల కొనుగోలు చూస్తున్నామని అన్నారు. మరోవైపు ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం కష్టమవుతోందని చెప్పారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా నిలబడి పోరాడాల్సిన సమయంలో స్వర్ణ లాంటి వారు చనిపోవడం ఉద్యమానికి లోటన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జేవి రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ కాజా గ్రామంలో కుల ఘర్షణలు లేకుండా ప్రజలంతా ఐకమత్యంతో ఉండేలా, గ్రామంలో ఆదర్శ వివాహాల నిర్వహణకు సుందరయ్య సాగరం ఏర్పాటుకు శివారెడ్డి కుటుంబం చేసిన కృషిని గుర్తు చేశారు. సిపిఎం విశాఖ నాయకులు ఎంఆర్‌పి రాజు మాట్లాడుతూ కార్యకర్తలందరికీ సుపరిచితులైన స్వర్ణ ఆయా అండగా ఉండడంతోపాటు వివిధ సందర్భాల్లో సలహాలు ఇచ్చేవారని చెప్పారు. స్వర్ణ భర్త సింహాద్రి కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడంలో ఇంటర్‌నెట్ కనెక్టివిటీ లాగా స్వర్ణ నిత్యం అందుబాటులో ఉండేదని పేర్కొన్నారు. చనిపోయే ముందు కూడా తోటి వారికి సహాయం అందించాలనే కాంక్షతో ఆతిథ్యం అందించారని చెప్పారు. స్వర్ణ చిత్రపటానికి నివాళులర్పించినవారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు కె.హరికిషోర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, ఇ.అప్పారావు, ల్యాంకో సిఇఒ సింహాద్రి వెంకట్రామిరెడ్డి, బి.నిర్మల, ఎం.పకీరయ్య, కె.శివరామకృష్ణయ్య, ఎన్.కాళిదాసు, బి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

విజ్ఞానాభివృద్ధికి విద్యార్థులు కష్టపడాలి

ప్రజాశక్తి-గుంటూరు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సరిత

గ్లోబలీకరణ నేపథ్యంలో విజ్ఞానం అనంతంగా పెరిగిందని, విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు పనికొచ్చే అన్ని రకాల మాధ్యమాలను ఉపయోగించుకోని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సిఐడి సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కెజివి సరిత అన్నారు. ఆదివారం స్థానిక నగరంపాలెం ఎస్‌విఎన్‌ఆర్ రెడ్డి బాలుర వసతి గృహంలో బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్మించిన భవనంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌పి సరిత మాట్లాడుతూ బండి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అశోక్ రెడ్డి సుధావాణి దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో హాస్టల్ పాలకవర్గ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, కే సంజీవరెడ్డి, నగర కార్పొరేటర్లు శ్రీనివాసరెడ్డి, పడాల సుబ్బారెడ్డి ఏపీ టెక్స్టైల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బూసి రెడ్డి మల్లేశ్వర రెడ్డి, ప్రొఫెసర్ షేక్ మస్తాన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

సవాళ్లను విద్యార్థులు అధిగమించాలి

ప్రజాశక్తి-గుంటూరు



బహుమతి అందచేస్తున్న డాక్టర్ పెరుమాళ్లు

విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్ధ వంతంగా అధిగమించాలని జెఎన్‌టియుకె సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కెవిఎస్‌జి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పుల్లడి గుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కాలేజి ప్రాంగణంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో మురళికృష్ణ ప్రొఫెషనల్ స్కిల్స్ ఫర్ కెరీర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తమకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకొని వ్యక్తిగత ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరో హించాలన్నారు. కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, అకడమిక్ అడ్వైజర్ కిషోర్‌బాబు, కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇండియన్ అకాడమీ సదస్సులు

- పరిశోధనాంశాలపై పలు కీలక తీర్మానాలు
- ప్రతిభ చూపిన నూతన ప్రతినిధులకు సభ్యత్వం



సదస్సులో విద్యార్థులు, సాంకేతిక నిపుణులు

ప్రజాశక్తి మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈ నెల 4నుంచి ప్రారంభమైన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 88వ వార్షిక సదస్సులు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. సదస్సుల నిర్వహణ కన్వీనర్ ప్రొఫెసర్ రంజిత్ సదస్సుల ముగింపుపై ప్రకటన చేశారు. ఈ నెల 3న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ యూనివర్సిటీకి విచ్చేసి ఇస్రో, భారత అణు ఇంధన శాఖల వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించగా, 4న ఇండియన్ అకాడమీ. ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమేష్ వీ వాగ్మారే సదస్సులను ప్రారంభించి పరిశోధనలకు సంబంధించిన సమీక్షలకు అంకురార్పణ చేశారు. సదస్సులకు హాజరైన వివిధ ప్రఖ్యాత యూనివర్సిటీల శాస్త్ర సాంకేతిక రంగ నిపుణులు వారివారి పరిశోధనాంశాలపై ప్రజెంటేషన్ అందించారు. మరికొందరు ఆయా రంగాల్లో జరిగిన పురోగతిని వివరించారు. న్యూఢిల్లీ, ముంబయి, ఖరగ్పూర్, తిరుపతి, కాన్పూర్ ఐఐటీలతో పాటు బనారస్ హిందూ యూనివర్సిటీ (వారణాసి), ఐఐఎస్సీ (బెంగళూర్), టీఐఎస్ఆర్ (ముంబయి) వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల నుంచి పేరున్న సైంటిఫిక్ రీసెర్చ్ ఫెలోస్ సుమారు 300 మంది వరకూ సదస్సులకు హాజరయ్యారు. ఇస్రో, డీఏఈ వారు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను నాలుగు రోజుల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులు సందర్శించారు. నూతన ఆవిష్కం ణలపైనే ప్రధానంగా సమీక్షించారు.సదస్సుల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ఆచార్య డి నారాయణరావు, కన్వీనర్ రంజిత్ థాపాలను రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ పాటు వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ అభినందించారు. చివరి రోజైన ఆదివారం సాయంత్రం ప్రతినిధులందరికీ ఎస్ఆర్ఎం యాజమాన్యం జ్ఞాపికలను ప్రదానం చేసింది. మూడు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేసిన వర్సిటీ ఉద్యోగులకు, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కే ఆరోరా, ప్రో వైస్ ఛాన్సలర్ ఆచార్య నారాయణ రావులకు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఎస్ చెంగయ్య

ఆశయాల కోసం చివరివరకూ పోరాడిన నాగేశ్వరరావు

ప్రజాశక్తి -మంగళగిరి: ఉద్యోగం చేస్తూ, కమ్యూనిస్టు ఆశయాల కొరకు నిరంతరం పాడుబడిన వ్యక్తి కంతేటి నాగేశ్వరరావు అని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. ఇటీవల మృతి చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు, పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి కంతేటి నాగేశ్వరావు సంస్కరణ సభ ఆదివారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఈ సభకు సిపిఎం పట్టణ నాయకులు టి శ్రీరాములు అధ్యక్ష వహించారు. చెంగయ్య మాట్లాడుతూ సిపిఎం సభ్యుడిగాను ఉండి సిపిఎం అబివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ నాగేశ్వరరావు చివరిదాకా సిపిఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేసే అందరి మన్ననలు పొందారని అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.గోపిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యలపై నిరంతరం పోరాడారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీలు నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - దుగ్గిరాల: ధాన్యం కల్లాలోనే మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక టర్మరిక్ అసోసియేషన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య హాజరవుతున్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండలంలోని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు హాజరుకావాలని ఒక ప్రకటనలో కోరారు. ప్రకటన జారీ చేసిన వారిలో వల్లభనేని సాంబశివరావు భీమవరపు అమ్మిరెడ్డి వై.బ్రమేశ్వరరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న బివి రమణకుమార్

మానవాభివృద్ధిలో యునెస్కో క్లబ్స్ అనన్య సేవలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ దేశాల ప్రజల విద్య సామాజిక శాస్త్రీయ అభివృద్ధి కోసం ఏర్పడిన యునెస్కో క్లబ్స్ దశాబ్దాలుగా కృషి చేస్తున్నాయని రాష్ట్ర సమాచార కమిషనర్ బివి రమణ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యునెస్కో దినోత్సవం, యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు రజతోత్సవాల కార్యక్రమం స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలు పారద్రో లకుండా యునెస్కో క్లబ్బుల స్థాపన లక్ష్యాలు నెరవేరయన్నారు. భారతదేశం ప్రపంచ కుబేరుల స్థానం కోసం పోటీ పడుతున్నా ఆర్థిక దిక్సూచిలో 132వ స్థానం, ఆకలి సూచీలో 107వ స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. రజతోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శుభాకాంక్షల సందేశం వినిపించారు. గుంటూరు యునెస్కో క్లబ్ అధ్యక్షులు రామనాథం పరమేశ్వరరావు అధ్యక్షత వహించగా స్టీల్ ప్రాజెక్ట్ విశ్రాంత సీఎండీ పి.మధుసూదన్, కాన్ ఫెడరేషన్ ఆఫ్ యునెస్కో క్లబ్స్ ఉపాధ్యక్షులు ఎన్.ఎన్.మిశ్రా, సెక్రెటరీ జనరల్ యోగేష్ కుల శ్రేష్ట, డాక్టర్ బొల్లినేని కీర్తి, దీప్తి శర్మ ప్రసంగించారు ఈ సందర్భంగా 13 మందికి యునెస్కో లీడర్స్ మెమోరియల్ అవార్డ్స్, 16 మందికి విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు.



నేటి నుంచి బిల్లులు లేకుండా పని చేయం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణ చిత్రిక మిషన్స్ అండ్ చెక్కుడు మిషన్ వారు స్థానిక బ్రహ్మంగారి గుడి ఆవరణలో జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు అంగలకుదురు ఆంజనేయులు అధ్యక్షత వహించారు. చిత్రిక కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నుండి చిత్రిక మిషన్లు, చెక్కుడు మిషన్ల కార్మికులు ఎటువంటి బిల్లులు లేకుండా పని చేయడం కుదరదని అన్నారు. చెక్కుడు పని కానీ చెక్క పని గానీ బిల్లులు ఉంటేనే చెక్క చిత్రిక పని చేస్తామని కమిటీ తీర్మానించినట్లు చెప్పారు.



బండ్లమోటులో న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - వినుకొండ

బండ్లమోటు గ్రామ సచివాలయంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పాన్ ఇండియా అవేర్నెస్ క్యాంపెయిన్‌లో భాగంగా న్యాయవాదులతో కలిసి మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ నిర్వహించిన ఈ సదస్సుకు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరే సామ్రాజ్యం అధ్యక్షత వహించారు. లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో,ఎలా సద్వినియోగం చేసుకోవాలో న్యాయమూర్తి వివరించారు. గ్రామ సచివాలయంలో అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొలం గట్టు తగాదాలు, ప్రామిసరి నోట్, భార్యాభర్తల తగాదాలు, అన్నదమ్ముల అస్తి పంపకాలు, పంట నష్ట పరిహారాల గురించి పలువురు న్యాయవాదులు వివరించారు.



10న సిఐటియు క్రోసూరు మండల మహాసభ

ప్రజాశక్తి-క్రోసూరు

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 10న జరగనున్న సిఐటియు క్రోసూరు మండల మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు అన్నారు. ఆదివారం ఆమంచి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు క్రోసూరు మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి సిఐటియు మండల అధ్యక్షులు యు.మురళి అధ్యక్షత వహించారు. రవిబాబు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఓసారి మహాసభలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. 10వ తేదీ సాయంత్రం క్రోసూరులో జరగనున్న సిఐటియు మహాసభలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి గర్నెపూడి మహేష్ మండల నాయకులు కె.మల్లికార్జునరావు, చిలుక యేసయ్య, గుంటుపల్లి శివ పార్వతి, సిహెచ్ మెరీనా,కె మంగమ్మ, షేక్ గారపాటి సుభాని, రమేష్, సుబ్బారావు, జి.రాము, టి.హనుమంతరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న బిజెపి విధానాలు

పల్నాడు జిల్లా సిఐటియు అధ్యక్షులు

ప్రజాశక్తి-ఈపూరు

బిజెపి విధానాలతో కార్మికుల హక్కులు హరిస్తున్నాయని పల్నాడు జిల్లా సిఐటియు అధ్యక్షులు కె హనుమంతరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. హనుమంతరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తున్నారని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, వంట సరుకులు, నిత్యావసర వస్తువులు ధరలను పెంచి నిరుపేదలపై పెను భారం మోపిందని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పనిగంటలను పెంచి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. సమ్మెకు, యూనియన్ పెట్టుకొనే హక్కు లేకుండా చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విద్య, వైద్యరంగం ప్రైవేటుకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అంగన్వాడి వర్కర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ వినుకొండలో డిసెంబర్ 17, 18వ తేదీలలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. సమావేశంలో వినుకొండ సిఐటియు కార్యదర్శి ఎ.ఆంజనేయులు, ఈపూరు మండల అధ్యక్షులు కె.వెంకటరమణ, కార్యదర్శి మేడికొండ దేవ సహాయం, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కనీస వేతనాల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి - నకరికల్లు

కనీస వేతనాల సాధన కోసం వివిధ రంగాల్లోని కార్మి కులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డి.శివకుమారి అన్నారు. స్థానిక భగత్‌సింగ్ ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నిత్యవసరాల ధరల పెరుగు దలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని దుయ్యబట్టారు. డిసెంబర్ 17, 18వ తేదీలలో వినుకొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఏడుగురితో మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా భూలక్ష్మి, కార్యదర్శిగా గోదా వెంకటరమణ ఎంపిక చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి గాడిదమల్లు పిచ్చారావు, షేక్ మునీరు, యాకూబ్,సైదా సాహెబ్, చీకటి రమేష్, కోటేశ్వరరావు, ఆశా వర్కర్ అన్నపూర్ణ పాల్గొన్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డి.శివకుమారి

వడియరాజుల కళ్యాణ మండపానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - మాచర్ల

వడియ రాజుల కళ్యాణ మండపం నిర్మాణానికి 30 సెంట్లు స్థలం 50 లక్షల రూపాయల గ్రాంట్ మంజూరు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానికగౌర్ల మండి సమీపంలో వడియ రాజుల కళ్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఓటు బ్యాంకుగా వాడుకున్నాడని వడియ రాజుల అభివృద్ధికి ఆయన చేసింది ఏమీ లేదని విమర్శించారు జగన్మోహన్ రెడ్డి వడియ రాజుల ఆర్థిక రాజకీయ ఎదుగుదలకు అండదండలు అందిస్తున్నారని అన్నారు. వడ్డెర్ల రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకు తన వంతు సహ కారమందిస్తానన్నారు. వడియరాజులు అవకాశా లను అందిపుచ్చుకుని ఐకమత్యంగా ఎదగాలని కోరారు. వడియరా జులను ఎస్టిలో చేర్చే విష యంలో ఆ సామాజిక వర్గ అభిప్రాయాలను ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్తానని, తన వంతు సహకారమందిస్తానని చెప్పారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మిర్చి మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు తన్నీరు ఆంజనేయులు, తెలంగాణ వడ్డెర సంఘం నాయకులు ఈ. ధర్మరాజు మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవన్న, రేవతి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





సత్తెనపల్లి నియోజకవర్గ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి

ప్రజాసంకల్ప యాత్ర ఓ సంచలనం : అంబటి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చేపట్టి న ప్రజా సంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఇది నిజంగా ఓ సంచలనమ ని జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబటి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి నేటికి ఐదేళ్లు పూర్తయిందని, ఈ యాత్ర అనుభవాలతో మూడేళ్లలో నవరత్నాల పథకాలను తొంభై ఐదు శాతం మంది ప్రజలకు అందించిన జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పర్యావరణ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుబ్బ చంద్రశేఖర్, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గీతా హాసంతి, మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు పాల్గొన్నారు .

హోంమంత్రి రాజీనామా చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాదుడే బాదుడు కార్యక్రమం సభలకు ప్రజల నుండి వస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేకనే వైసిసి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడుపై రాళ్ల దాడి చేశారని నరస రావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అర విందబాబు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై జరిగిన రాళ్ల దాడిని నిరసిస్తూ తెలుగు యువత, తెలుగు విద్యార్థి, తెలుగు మహిళ నాయకులు నల్ల బెలూన్లతో స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నుండి శివుని బొమ్మ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చదలవాడ మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని, రాళ్లు వేయించిన వారిని, రాళ్లు వేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

చిలకలూరిపేట సిఐటియు నూతన కమిటి ఎన్నిక

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట మండల సిఐటియు 15వ మహాసభ ఆదివారం స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. అనంతరం కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. చర్చల అనంతరం దీనిని ఆమోదించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జల్లెడ రాజశేఖర్, పేరుబోయిన వెంకటేశ్వర్లు, 25 మందితో నూతన కమిటీని ఎన్ను కున్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని సంతగుడిపాడులో ఉచిత మెగా నేత్రవైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. నరసరావుపేట కు చెందిన ఎం.వి.రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రోసూరి వీర రాఘవులు, చింతగుంట అంజి రెడ్డి ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ ఎం వివేకానందరెడ్డి వైద్యసేవలందించారు. ఇక్కడి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామా లకు చెందిన 238 మందికి నేత్ర వైద్య పరీ క్షలు నిర్వహించారు. వారిలో 62 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు నాగసిరి లాంచీ,శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్దిని ప్రతిమలు,రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం,అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధి వక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు నాగార్జున కొండను సందర్శించడంతో లాంచీ స్టేషన్ కు 60 వేల రూపాయల ఆదాయం సమకూరింది.





మాట్లాడుతున్న వైవిఎస్‌బి జి. పార్ధసారథి

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-కొల్లిపర

న్యాయ చట్టాలపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వైవిఎస్‌బి జి.పార్ధసారథి అన్నారు. ఆదివారం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో అడిషనల్ జిల్లా జడ్జి జి. మాలతి అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. వాది ప్రతివాది వాదిచ్చుకుంటే ఒకరే గెలుస్తారు కానీ ఇద్దరు కలిసి చర్చించుకుంటే ఇద్దరు గెలుస్తారని సూచించారు. ఈనెల 12వ తేదీన జాతీయ స్థాయిలో జరిగే లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని హితవు పలికారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రత్నకుమార్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, తెనాలి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా, తెనాలి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. సీత ,పారా లీగల్ వాలంటీర్ అనిల్ కుమార్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాలరావు, తెనాలి డిఎస్‌పి స్రవంతి రాయి, తెనాలి వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం, ఎంపిపి భీమవరపు పద్మావతి ,తహశీల్దార్ నాంచారయ్య, ఎస్‌ఐ ఆర్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పారా లీగల్ వాలంటీర్లు

చట్టాలపై అవగాహన కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలతో నవంబర్ 1 నుండి 13వ తేదీ వరకూ గుంటూరు నగరంలో ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు చేపట్టిన అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక గుండారావుపేట, వడ్డెరగూడెంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివిధ రకాల చట్టాలపై అవగాహనకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కట్టా కాళిదాసు, పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్.గీతాంజలి, ఎస్.కె.దరియాబి, జి.సురేష్, ఎ.దేవికారాణి, ఎస్.కె.షకీలా, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



శివాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శివ భక్త బృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భక్త బృందం ప్రతినిధి, భగీరథ ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ శివాలయంలో గత 30ఏళ్ల నుంచి నెలలో ఒక ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని భక్తులు తాకిడి ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఈ నెలలో సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు జి. రామాంజనేయులు, మన్నెం రమేష్, కదం రాంబాబు, ఎ.రామకృష్ణారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

కౌలు రైతుల సంక్షేమాన్ని విస్మరించడం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెదనందిపాడు: కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం తగదని, భూ యజమాని సంతకం తో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందజేయాలని సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం పెదనందిపాడు విశ్రాంత ఉపాధ్యాయుల భవనంలో కౌలు రైతు సంఘం మండల మహాసభ ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని, వాస్తవ సాగుదారులు కౌలు రైతులేనని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ విధానాల వల్ల వారికి గుర్తింపు కార్డులు, పంట రుణాలు, నష్టపరిహారం, రైతు భరోసా వంటివి అందటం లేదని తెలిపారు. మండల కార్యదర్శి కొత్త శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులలో అధికంగా పేదలు, దళితులే ఉన్నారని వారి సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించడం తగదని తెలిపారు. అనంతరం కౌలు రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు,


మండల అధ్యక్షులు శ్రీనివాసరావు ,శివనాగేశ్వరరావు

అధ్యక్షులుగా కారంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొత్త శివనాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఆళ్ల విజయభాస్కరరావు, జెట్టి పెద్దన్న, సహాయ కార్యదర్శులుగా షేక్ మౌలాం సాహెబ్, కట్ట వీర వసంతరావు, కోశాధికారిగా బండారు బిక్షాలు, సభ్యులుగా దాసరి జనార్ధన్, చుక్క యానాదులు, ఇక్కుర్తి పోతురాజు, నంగినేని నాగేశ్వరరావు, కట్ట రాజు, ఆర్ జాను, ఎస్ జ్యోతి కుమారి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'హోమియోతో సంపూర్ణ అరోగ్యం'


మాట్లాడుతున్న హోమియోపతి వైద్యులు కె. నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గుంటూరు

హోమియోపతి వైద్యం ద్వారానే సంపూర్ణ అరోగ్యం సాధ్యమని ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అవగాహన ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో న్యాయవాది ఎ.హరి అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వందల ఏళ్ల గా హోమియోపతి వైద్యం ఆదరణలో ఉందని, సరైన హోమియో మందు వేసుకుంటే ఫలితం కనిపిస్తుందన్నారు. హోమియో పతి మందులు శరీరానికి ఎలాంటి హానీ చేయవని, ఏ వయస్సు వారైనా వాడవచ్చన్నారు. ఇవి ప్రకృతిలో దొరికే పదార్థాలతోటే తయారవుతాయన్నారు. వ్యాధి మూలాలు తెలుసుకొని వైద్యం చేయటం శాశ్వతంగా నయం చేయటం సాధ్యమవుతుందన్నారు. పోస్ట్ కోవిడ్ సైడ్ ఎఫెక్ట్‌కి హోమియోలో మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం డాక్టర్ నాగేశ్వరరావును అవగాహన సభ్యులు సన్మానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బిసి చైతన్య సమితి నాయకులు

బీసీల కుల గణన చేయాలి

ప్రజాశక్తి -మంగళగిరి

బిసిల జనాభా కులాల వారీగా కుల గణన చేయాలని, పతి జిల్లాలో మూడు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని ఏపి బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు రమణ పేర్కొన్నారు. మంగళగిరి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల జనాభా కులాల వారీగా లెక్కించాలనేది బిసి వర్గాల చిరకాల కోరిక అని, ఇప్పటికైనా ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరతనగండ్ల వాసు మాట్లాడుతూ కొన్ని బిసి సంఘాలు జనాభా ఎక్కువగా ఉన్న కులాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని, బిసిల్లో ఉన్న దిగువ స్థాయి కులాలకు కూడా ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. వచ్చేనెలలో విజయవాడలో జరిగే ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా బిసిలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఏపి బిసి చైతన్య సమితి అసోసియేట్ అధ్యక్షులు కావేటి వేణుగోపాలరావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఏపీబీసీ చైతన్య సమితి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా నియమించిన వ్యవస్థాపక అధ్యక్షులు రమణకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఏపిబిసి చైతన్య సమితి యువజన అధికార ప్రతినిధి మునగాల సునీల్, గుంటూరు నగర మహిళా అధ్యక్షురాలు, ముప్వ బుజ్జమ్మ, కె.శ్రీరాములు, వై.వేణు, పి.రమణయ్య, ఎన్.సుబ్బారావు, ఎ.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కులం రొంపిలోకి నన్ను లాగొద్దు : అనిల్‌కుమార్ యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. అనికుమార్ యాదవ్

ప్రజాశక్తి - తాడికొండ

జీవితంలోనూ, రాజకీయాలలోనూ కష్టపడకుండా ఏ అవకాశాలు రావని మాజీమంత్రి వైసిపి నెల్లూరు ఎమ్మెల్యే పి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. తాడికొండ అడ్డరోడ్డు సెంటర్లో ఆదివారం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనిల్ కుమార్ యాదవ్ హాజరవగా, కార్యక్రమానికి బోళ్ళ శివశంకర్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పునాదులు గట్టిగా ఉంటే జాతి అబివృద్ధి చెందుతుందని అన్నారు. తనను కులం రొంపిలోకి లాగవద్దని, నెల్లూరులో అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేస్తేనే తాను గెలుపొందానని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి యాదవ్, రమేష్ యాదవ్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్యాం ప్రసాద్ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎం హరీష్ యాదవ్, సంఘ నాయకులు ఆలా వెంకటేశ్వర్లు , ఎన్ బాలాజీ ఎం ఎన్ కొండయ్య, వై నాగార్జున, నిమ్మకాయల రాజనారాయణ సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.


వ్యవసాయ కార్మికులతో మాట్లాడుతున్న బత్తుల సంసోను

నేడు వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని సోమవారం ఏంటీఎంసీ పరిధిలోని గుండిమెడలో జరుగు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని తాడేపల్లి మండల అధ్యక్షులు బత్తుల సంసోను పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కుంచనపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ కార్మికులతో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి మండలంలోని గ్రామాలలో మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో, ఉపాధి హామీ పథకం పనులు అధికారులు నిలిపేసారని అన్నారు. దీంతో వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండా పోయాయని ఆయన అన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించి, సమగ్ర చట్టం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈమండల మహాసభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, మహిళా సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కొండపల్లి యశోద పాల్గొన్నారు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తవ్వకాలు


ప్రజాశక్తి-కొల్లిపర: ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని కావున వాటిని ఆపేందుకు ప్రయత్నించటం నేరమని తెనాలి సిఐ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్త బొమ్మవారి పాలెం ఇసుక రీచ్‌లో ఇసుక తవ్వకాలను నిలువరించారన్న సమాచారంతో సంఘటన స్థలానికి ఆయన చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం గుర్తించిన ప్రాంతంలో ఇసుక తవ్వకాలు నిర్వహించడం లేదని తూములూరు లంబాడి పాలెం చెందిన గ్రామస్తులు ఆరోపించడంతో సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలి ఇసుక ఎగుమతులను ఆపడం సరికాదన్నారు. భూగర్భ గనుల శాఖ అధికారులకు సమాచారం అందిస్తామని సిఐ తెలిపారు.



'వైసిపి పాలనలో ముస్లిమ్ మైనార్టీలకు అన్యాయం'

ప్రజాశక్తి- మంగళగిరి

వైసిపి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు అన్యాయం జరిగిందని పట్టణ మైనార్టీ సెల్ టిడిపి ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని 27 వార్డులో బాదుడే బాదుడు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే ముస్లిం మైనార్టీలకు ఏమి చేయలేదని విమర్శించారు. ఆటోనగర్లో ఎక్కువగా పని చేసేది ముస్లింలని వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆర్కే కృషి చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సుభాని, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, ఎండి ఇబ్రహీం, గోశాల రాఘవ పాల్గొన్నారు.



వరగానిలో ప్రచారం

గుంటూరు ఛానల్ విస్తరణ కోసం 10న సదస్సు

- హాజరుకానున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- జయప్రదం కోసం గ్రామాల్లో రైతు సంఘం ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న పెదనందిపాడులో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రమైన పెదనందిపాడు, నాగులపాడు, వరగాని, పాలపర్రు, అన్నారం గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం 70 ఏళ్ల నుండి పోరాటాలు నడుస్తున్నాయని గుర్తు చేశారు. ఛానల్ విస్తరణ వల్ల నాలుగు మండలాల్లోని 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కీలకమైన ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించటం తగదన్నారు. భూ సేకరణకు ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని, పనులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దీనికోసం నిర్వహించే సదస్సుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు కాకుమాను నాగేశ్వర రావు, కందుల శ్రీనివాసరావు హాజరవు తారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ప్రచారంలో రైతు సంఘం నాయకులు జె.రామారావు, కె.వెంకటశివ రావు, డి.రమేష్‌బాబు, సిహెచ్.యానా దులు, పి.సుధీర్ పాల్గొన్నారు.

త్వరలోనే ధాన్యం కొనుగోలు

- 150 ఆర్‌బికెల పరిధిలో 55 టన్నుల కొనుగోలు లక్ష్యం
- ఈ-క్రాప్ ఆధారంగానే.. - తేమ 17 శాతం లోపే ఉండాలి
- వివరాల నమోదులో ఒక్కోచోట ముగ్గురు వాలంటీర్లు
- ప్రజాశక్తితో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ లక్ష్మీ




పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.లక్ష్మీ

జిల్లాలో ఈనెల మూడో వారం నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి.లక్ష్మీ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేసున్నామని, రైతుల పొలం వద్దనే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రక్రియంతా పారదర్శకం నిర్వహిస్తామన్నారు. రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె)లో రైతుల వివరాలు ఉంటాయని, ఈ-క్రాప్ ఆధారంగానే కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

62 క్లస్టర్ల పరిధిలో 150 ఆర్‌బికేలు ఉన్నాయి. 150 కేంద్రాల నుంచి ధాన్యం కొంటాం. వీటితో పాటు జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) పరిధిలో సహకార సంఘాలు, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కూడా కొనుగోలు చేస్తారు.

కొనుగోలు ఎప్పటి నుంచి ప్రారంభం?

కృష్ణా డెల్టాలో ఈనెల మూడో వారం నుంచి నూర్పిడులు ప్రారంభం అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ధాన్యం కోతలు ప్రారంభం కాగానే కొనుగోలు చేస్తాం.

కొనుగోలులో మార్గదర్శకాలు ఏమిటి?

ప్రతి ఆర్‌బికె పరిధిలో ముగ్గురు వాలంటీర్లు కొనుగోలుకు పని చేస్తారు. గోతాలు సరఫరా, లోడింగ్, అన్‌లోడింగ్‌కు ముఠా కూలీలు ఏర్పాటు, పొలం నుంచి ఆర్‌బికె ద్వారా మిల్లుకు పంపేందుకు వాహనాలను అందుబాటులోకి ఉంచడం వంటివి వాలంటీర్లు బాధ్యతగా నిర్ణయించారు. వే బ్రిడ్జిల వద్ద కాటాల పరిశీలన చేస్తారు. ధాన్యం నాణ్యత పరిశీలన తరువాత ధర నిర్ణయించాలని ఆదేశాలు వచ్చాయి. 17 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయరు. తేమ ఎక్కువగా ఉంటే రైతులు ధాన్యం ఆర బెట్టుకు రావాలి. కళ్లంలో ధాన్యం పరిశీలన చేసినప్పటి నుంచి ప్రతి స్థాయిలో వాలంటీర్లు ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. రైతులతో కళ్లం దగ్గర, కాటా వేసే వే బ్రిడ్జి వద్ద, మిల్లు వద్ద వాలంటీర్లు సిబ్బంది ఫొటోలను పంపాలి. తేమ శాతం నిర్ధారించేందుకు మిషన్లు కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

కొనుగోలు కేంద్రాలపై పర్యవేక్షణ ఎవరిది?

వాలంటీర్లపై విఆర్‌ఒ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహశీల్దార్ చూస్తారు. మిల్లు వద్ద కస్టోడియల్ అధికారిగా ఆర్‌ఐ ఉంటారు.

ఖరీఫ్‌లో కొనుగోలు లక్ష్యం ఎంత?

ప్రస్తుతం 55 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతకన్నా ఎక్కువ కొనుగోలు చేసే అవకాశం ఉంది.

కనీస మద్దతు ధర ఎంత?

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 'ఎ' గ్రేడ్‌కు క్వింటాళ్ రూ.2060, సాధారణ రకమైతే రూ.2040గా నిర్ణయించారు. 75 కిలోల బస్తా 'ఎ' గ్రేడ్ రూ.1545, సాధారణ రకం రూ.1530కు కొనుగోలు చేయాలి. కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోలు చేయడమే ప్రభుత్వ కర్తవ్యం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వీరబ్రహ్మం తాత్వికతపై 12న సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు : తెలుగునాట గొప్ప తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. అంబేద్కర్, జాషువా, పెరియార్, పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12న బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సామాజిక తత్వవేత్త వీరబ్రహ్మం-తాత్వికతపై నిర్వహిస్తున్న సదసస్సు ఆహ్వాన పత్రాలను మాణిక్యవరప్రసాద్ ఆదివారం బ్రాడీపేటలో ఆవిష్కరించారు. కవి విల్సన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డొక్కా మాట్లాడుతూ కులాధిపత్యంపై పోరాడిన తత్వవేత్తలతో వీరబ్రహ్మం గొప్పవాడని అన్నారు. సదస్సుకు వీరబ్రహ్మం 8వ తరం మునిమనవడు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో లిటరేచర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కె.జేమ్స్, ప్రధాన కార్యదర్శి బి.శ్యాంబాబు, కవి ఎస్‌ఎం సుభాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఎంవిఎస్ స్కూల్లో ఎన్‌టిఎస్‌ఇ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ యుపి స్కూల్‌లో గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ సౌజన్యంతో నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ (ఎన్‌టిఎస్‌ఇ) ఉచిత శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో బోధనే పునాది అని, పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదవి, వాటిల్లోని సారాంశాన్ని గ్రహించాలని చెపాపరు. అలా చేస్తే భవిష్యత్‌లో ఎటువంటి పోటీ పరీక్షలనైనా ఎదుర్కొనగలరన్నారు. ఎన్‌టిఎస్ పరీక్షలకు కష్టపడి చదవాలని, దీన్ని ఒక అవకాశంగా భావించి, విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.తాండవ కృష్ణ, రిసోర్స్‌పర్సన్లు రాజారావు, డాక్టర్ అనంత లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

12న వ్యకాస జిల్లా మహాసభ

'ప్రభుత్వ విధానాలు -వ్యవసాయ కార్మికులపై ప్రభావం' అంశంపై సదస్సు - కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా 29వ మహాసభ ఈ నెల 12వ తేదీన మంగళగిరి మండలం కాజలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఇ.అప్పారావు తెలిపారు. మహాసభ సందర్భంగా 'ప్రభుత్వ విధానాలు -వ్యవసాయ కార్మికులపై ప్రభావం' అంశంపై సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు కరపత్రాన్ని కాజలో ఆదివారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడు తూ వ్యవసాయ కార్మికులు శ్రమ దోపిడీ గురవుతున్నారని, అత్యంత తక్కువ వేతనాలతో జీవనం గడుపు తున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమ స్యలు, కూలి రేట్లపై మహాసభలో చర్చిస్తామన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, పట్టణ ప్రాంతాలకూ దీన్ని విస్తరించడం అవసరమని చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసత లు, ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల ఆక్రమణ తదిర అంశాలపైనా చర్చించి పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళ కన్వీనర్ వి.శివనాగరాణి, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామా రావు పాల్గొంటారని, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బి.కోటేశ్వరి, సహాయ కార్యదర్శి జె.బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాస రావు, రైతు సంఘం మంగళగిరి మండల కార్యదర్శి టి.ప్రసాద్‌రెడ్డి, ఐద్వా నాయకులు ఎస్.నిర్మల, ఎస్.ప్రతిభ పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

14న కౌలురైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఈనెల 14న నిర్వహించే ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.సురేష్, బి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, వాస్తవ సాగుదారులైన కౌలు రైతుల పేరుతోనే పంట నమోదు చేయాలని సంఘం పోరాడుతోందన్నారు. గతంలో భూ యజమాని తో సంబంధం లేకుండా గ్రామసభల్లోనే కౌలు రైతులను గుర్తించి, రుణ అర్హత కార్డులు మంజూరు చేసే వారని, పంట రుణాలు ఆ కార్డు ద్వారా మంజూరు చేసే వారని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ యజమానితో ఒప్పందం చేసుకోవాలని చట్టంలో మార్పులు తెచ్చిందని, దీనివల్ల 15 శాతం మందికి కూడా గుర్తింపు కార్డులు రావడంలేదని, పంట రుణాలు, పంట నమోదు, ప్రభుత్వ సబ్సిడీలు, రాయితీలకు దూరమవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కౌల్దార్లకు గుర్తింపు కార్డులిచ్చినా డబల్ ఫైనాన్స్ పేరుతో పంట రుణాలకు బ్యాంక్ అధికారులు నిరాకరిస్తున్నారని, ఇది చట్టరీత్యా సరికాదని చెప్పారు. డెల్టాలో 80 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నా వారిని ప్రభు త్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహ త్యలకు పాల్పడుతున్నారని విమర్శిం చారు. ఈ అంశాలపై చర్చించి పోరాటా కార్యాచరణ రూపొందించే ందుకు మహాసభను నిర్వహిస్తు న్నామని చెప్పారు. మహాసభకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు హాజరవుతారని కౌల్దార్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, నాయకులు ఎం.ఎల్లమందయ్య, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు